

**ఫలితాలపై ఆసక్తి** ▶ మంగళ వారం పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సందర్భంగా నగరంలో ఫుట్‌పాత్‌పై స్క్రీన్ ఏర్పాటు చేయడంతో ఆసక్తిగా తిలకిస్తున్న నగరవాసులు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 5 జూన్ 2024 | HYDERABAD


## ఐదోసారి గెలిచిన అసదుద్దీన్ ఒవైసీ



సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించారు. దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళ వారం వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో ఒకటైన హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ 5వ సారి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కె.మాధవీలతపై 3.3 లక్షల ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు. అంతకు ముందు 2019లో, 2014, 2009, 2004లో జరిగిన ఎన్నికల్లోనూ వరుసగా ఆయనే హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి గెలుపొందారు. అంతకుముందు 1994-1999, 1999-2004 వరకు చార్మినార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## విద్యుత్ మరమ్మతులకు ప్రత్యేక బృందాలు

### వర్షాకాలంలో నిరంతరాయంగా పర్యవేక్షణ

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలతో ముంపు సమస్యలే కాదు.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగానే ఉంటాయి. ఈ నేపథ్యంలో మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. గ్రేటర్ పరిధిలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 9 సర్కిళ్ల పరిధిలో క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలు పర్యవేక్షణ చేపట్టాలని, ఎక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా యుద్ధ ప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో ఆయా సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకొని పగలు, రాత్రి వేళల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా ప్రాంతాల నుంచి విద్యుత్ సరఫరాపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తూ, వాటిని త్వరితగతిన పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచనలు చేశారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ పర్యవేక్షణ కోసం స్కాడాలోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి అంతరాయం ఎక్కడ ఉందో తెలుసుకొని అక్కడ పునరుద్ధరించేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



**చల్లని సాయంత్రం..** ▶ మంగళ వారం మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టింది. దీంతో నగరవాసులు ఎండ వేడిమి తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఆ వెంటనే సాయంత్రం వర్షం కురువడంతో కాస్త ఉపశమనం చెందారు.

## స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు భద్రం

### 45 రోజుల తర్వాత ఐదేండ్ల పాటు ఎన్నికల సంఘం ఆధీనంలోకి

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ ): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు ఎన్నికల క్రతువును ముగించారు. అయితే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలను మాత్రం పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈవీఎంలతో పాటు వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్, తదితర ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి తాళాలు వేసి సీల్ వేశారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చుతారు. ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి వాటిలోని డేటాను తొలగించి అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకువెళ్లి ఉపయోగిస్తారు.

**ఐదేండ్లలో ఆ సమయంలో అవి కీలకం..**

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థులు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. అంతేకాదు ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై ఓడిన వారు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు భావించి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇవి కీలకం అవుతాయి. ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను తక్షణమే లెక్కించడానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరిచారు.

# సీఎం సిట్టింగ్ స్థానం హుష్‌కాకి




### ‘చే’జారిన దేశంలోనే అతి పెద్ద స్థానం మల్కాజిగిరి

### రేవంత్ ప్రాతినిథ్యం వహించిన స్థానం కోల్పోవడంపై పెద్ద ఎత్తున చర్చ

### ఆచితూచి అడుగేసినా తప్పని ఓటమి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 4 (నమస్త తెలంగాణ): ‘ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రాతినిథ్యం వహించే రెండు నియోజకవర్గాలు కలిపినా నా నియోజకవర్గం (మల్కాజిగిరి పార్లమెంటు స్థానం) అంత పెద్దగా ఉండవు. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి నేను ప్రాతినిథ్యం వహిస్తున్నాను...’ నిన్నటిదాకా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానంపై చెప్పుకునే గొప్పలివి. కానీ తాజా ఫలితాల్లో మల్కాజిగిరి ‘చే’జారిపోయింది. సీఎం రేవంత్ సిట్టింగ్ స్థానంలో హస్తం హవా కొనసాగించాలని తీవ్ర ప్రయత్నాలు చేసి, ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు. ఇదే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే కాదు.. తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ మహా నగర పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి ఒక చరిత్ర ఉంది. గతంలో దేశంలోనే అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గంగా ఖైరతాబాద్ ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఖైరతాబాద్ ఆ ప్రాధాన్యతను కోల్పోయింది. ఖైరతాబాద్‌తో పాటు జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలుగా ఏర్పడ్డాయి. ఇదే సమయంలో లోక్‌సభ స్థానాలు కూడా పునర్విభజన జరగడంతో సిద్దిపేట స్థానంలో మల్కాజిగిరి పార్లమెంటు స్థానం ఏర్పడింది. మల్కాజిగిరి, కంటోన్మెంట్, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానాలతో ఏర్పడిన ఈ నియోజకవర్గం దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ స్థానంగా ఆవిర్భవించింది. ఈ క్రమంలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఐదేళ్లు తిరిగేసరికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడంతో ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా భావించింది. రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గానే తీసుకొని అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ వరకు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా అభ్యర్థి ఎంపిక విషయంలో పూర్తిగా సీఎం తన సొంత నిర్ణయాన్ని తీసుకొని, అధిష్ఠానాన్ని ఒప్పించారని పార్టీ వర్గాలే తెలిపాయి.

**వికారాబాద్ నుంచి తరలింపు..**

వాస్తవానికి చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని ఆశించి పట్నం దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారనేది బహిరంగ రహస్యం. కానీ సీఎం మాత్రం తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలోకి దింపేందుకు నిర్ణయించారు. మల్కాజిగిరి పరిధిలోని కాంగ్రెస్ నేతలు, ఇతర నాయకులు అక్కడి నుంచి పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ సీఎం మాత్రం పట్టుబట్టి సునీతా మహేందర్‌రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నారు. అప్పుడు మొదలు పోలింగు వరకు కూడా ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేతలు సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అయినా ఓటర్లు మాత్రం తీర్పు మరోలా ఇచ్చారు. ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇదే కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎం సొంత జిల్లాలోని మహబూబ్‌నగర్‌తో పాటు చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కూడా ప్రతిష్ఠాత్మకంగానే తీసుకున్నారు. కానీ సిట్టింగ్ సహా మూడు స్థానాల్లో ఆయనకు ఎదురుగాలి వీయడం గమనార్హం.

# జంపింగ్ జపాంగ్‌లకు ఝలక్

### బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురికీ తప్పని ఓటమి

### మల్కాజిగిరిలో పట్నం, చేవెళ్లలో రంజిత్, సికింద్రాబాద్‌లో దానం పరాజయం

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 4 (నమస్తే తెలంగాణ): బెల్లం చుట్టూ ఈగల్లా... అధికారం చుట్టూ కొందరు నేతలు నిలకడ లేకుండా వ్యవహరిస్తారు. ప్రజలెవరూ ఇదేమీ గమనించలేదని భ్రమిస్తారు. కానీ... ప్రజా తీర్పులో మాత్రం ఆ మేరకు తేడా కొడుతుందని ఫలితాల్లో తేలిపోతుంది. ఇందులో భాగంగా తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లోనూ హైదరాబాద్ మహానగర పరిధిలో జంపింగ్ జపాంగ్‌లకు ఓటర్లు భారీ ఝలక్ ఇచ్చారు. ప్రధానంగా ఎన్నికల ముందే బీఆర్‌ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి టికెట్లు దక్కించుకున్న ముగ్గురు అభ్యర్థులూ ఓటమి పాలయ్యారు.



గత ఏడాది చివరలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొలువుదీరింది. అనంతరం కొన్ని నెలలకే వచ్చిన పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పరిణామాలు మారాయి. ఇందులో కొందరు నేతలు ఏండ్ల తరబడి కొనసాగిన పార్టీని వదిలి రాత్రికి రాత్రి పార్టీ పిరాయించారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్లు సాధించి... ఎంపీలుగా మారాలనుకున్నారు. కానీ వారొకటి తలిస్తే.. దైవమొకటి తలచినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. తొలుత మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బీఆర్‌ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. వాస్తవానికి వీళ్లు చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టి.. తన సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి లోక్‌సభ నుంచి వీరికి టికెట్ ఇప్పించారు. అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి 2019లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి గెలిచిన రంజిత్‌రెడ్డి తిరిగి గులాబీ జెండా మీదనే పోటీ చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధమైనట్లు ప్రకటించారు. పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చి తన అభ్యర్థిత్వాన్ని సైతం ముందుగానే ఖరారు చేయించుకున్నారు. కానీ రాత్రికి రాత్రి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి కండువా కప్పుకుని చేవెళ్ల స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. దీని తర్వాత ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి, గెలిచిన దానం నాగేందర్ సైతం రాత్రికి రాత్రి పార్టీ మారారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఇలా ముగ్గురు నేతలు కూడా గులాబీ చెంతనే ఉండి... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హస్తం గూటికి చేరి లోక్‌సభ స్థానాల్లో పోటీ చేశారు. మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్ మూడు స్థానాల్లో జంపింగ్ జపాంగ్‌లకు ఓటర్లు షాక్ ఇచ్చారు. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన సునీతా మహేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అక్కడ బీజేపీ తరఫున ఈటల రాజేందర్ విజయాన్ని కైవసం చేసుకున్నారు. చేవెళ్ల పార్లమెంటు స్థానంలో కూడా రంజిత్‌రెడ్డి తన స్టిటింగ్ స్థానాన్ని కోల్పోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఇక... సికింద్రాబాద్ స్థానంలో కూడా దానం నాగేందర్ ఓటమి పాలయ్యారు. ఈ స్థానంలో మాజీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతిలో దానం ఓటమి చెందారు.

## ఓట్ల లెక్కింపు ప్రశాంతం

### సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

### జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్



సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు. మంగళవారం జిల్లాలో పార్లమెంట్ ఓట్ల లెక్కింపు 13 లొకేషన్లలో 16 కౌంటింగ్ కేంద్రాల్లో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కమిషనర్ కార్వాన్, నాంపల్లి, యాకుత్‌పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి సహకరించిన మీడియా ప్రతినిధులు, కౌంటింగ్ అబ్జర్వర్స్, పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి ధన్యవాదాలు తెలిపారు.

## సజావుగా పార్లమెంట్ ఓట్ల లెక్కింపు

### కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు పకడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రతతో లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి చిన్న ఘటన కూడా తావు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హైదరాబాద్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి తోపాటు చేవెళ్ల, భువనగిరి పార్లమెంట్ స్థానాలకు సంబంధించిన కొన్ని కేంద్రాల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా పార్టీల నేతలు, ఏజెంట్లు ఎన్నికల కౌంటింగ్ హాలులోకి వెళ్లారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగగా ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో ఈవీఎం యంత్రాలను భద్ర పరిచి, ఆయా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మంగళవారం వాటిని తెరిచి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి ఆయా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు. కమిషనర్లు ఎప్పకటిప్పుడు ఆయా కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించారు.

## సోషల్ మీడియా జోరు

### ఫలితాలపై నగరవాసుల్లో ఉత్కంఠ

### ఉదయం నుంచే అతుక్కుపోయిన జనాలు

సిటీబ్యూరో, జూన్ 4(నమస్తే తెలంగాణ): మూడునెలల ఎన్నికల పర్వానికి తెర పడింది. ఎన్నికల ప్రక్రియ చివరిదైనా కౌంటింగ్ దశ ఉత్కంఠతో ముగిసింది. దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలను తెలుసుకునేందుకు జనాలు ఉదయం నుంచే ఆసక్తిగా తిలకించారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు, పార్టీల నేతలు బిగ్ స్క్రీనింగ్‌తో సందడి వాతావరణం నెలకొనగా.. సిటీ జనాలు కౌంటింగ్ సరళిని గమనిస్తూ ఉండటంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిపోయింది. పోటాపోటీగా కామెంట్లు, రీట్వీట్లు, రీల్స్‌తో మోతమోగిపోయింది. నెటిజన్లు ఉదయం నుంచే చురుగ్గా వ్యవహరించడంతో రిజల్ట్ డే రోజున electionresultupdate, LoksabhaPollResults యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చాయి. ఇక పొరుగు రాష్ట్రం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యంత ఉత్కంఠకు తెరలేపాయి. ఉదయం నుంచే వైసీపీ, టీడీపీ, పవన్ మద్దతుదారులు కౌంటింగ్ సరళిని సోషల్ మీడియాలో పంచుకోవడంతో మరింత చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో అబ్ కీ బాద్ మోదీ సర్కార్ అంటూ బీజేపీ సేనలు ఫలితాలను చూసి కొంత నిరుత్సాహానికి గురికాగా, కాంగ్రెస్ మద్దతుదారులు కూడా ఫలితాలను తెలుసుకునేందుకు ఎక్కువగా ఎక్స్, ఇన్‌స్టాతోపాటు, ఉదయం నుంచే యూట్యూబ్‌లో వచ్చే లైవ్ టెలికాస్ట్‌లకు అతుక్కుపోయారు. దీంతో నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు నిర్మానుష్యంగా మారింది. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లేవారితో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు కూడా ఇవాళ తక్కువ ట్రాఫిక్ రద్దీతో వాహనాలు ముందుకు సాగాయి. ఇక ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఫలితాలు వెలువడినా నగరంలో పెద్దగా సంబురాలు చేసుకోలేదు. పార్టీ కార్యాలయాలకే సంబురాలు పరిమితమయ్యాయి. ఇక మెజార్టీ జనాలు తమ అభిప్రాయాలను పంచుకునేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు.




ఓయూలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

## పార్లమెంట్ విజేతలు వీరే!

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పార్లమెంట్ స్థానంపై అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సత్తా చాటారు. సమీప బీజేపీ అభ్యర్థి మాధవీలతపై 3, 38,087 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సికింద్రాబాద్ పార్లమెంట్ విషయానికొస్తే కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి విజయం సాధించి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకున్నారు. దానం నాగేందర్‌పై 49,944 ఓట్ల తేడాతో కిషన్‌రెడ్డి విజయాన్ని అందుకున్నారు. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో కమలం రెపరెపలాడింది. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ 3,91,475 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్‌ను పరిశీలిస్తే బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి 7,98,517 ఓట్లు రాగా..కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి 6,30,861 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి పై కొండా విశ్వేశ్వర్ రెడ్డి 1,67,656 మెజార్టీతో గెలుపొందారు.